

జేసీ రాజేంద్రన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 24: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం ఉదయం 10:30 గంటలకు రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళతానని తెలిపారు. అనంతరం డీఆర్‌వో సత్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

ఎర్రచందనం రవాణాను పసిగట్టే జాగిలాలు

● తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో పరిశీలించిన అధికారులు

రైల్వేకోడూరు, జూలై 24: ఎర్రచందనం అక్రమ రవాణాను పసిగట్టే టాస్క్‌ఫోర్సు జాగిలాల పనితీరుపై బుధవారం తిరుపతి టాస్క్‌ఫోర్సు ప్రధాన కార్యాలయంలో ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి (ఆపరేషన్స్) జాగిలాల శిక్షకుల పర్యవేక్షణలో ఎర్రచందనం దుంగల వాసనను ఎలా పసిగట్టుతాయి అనే దానిపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగిలాలకు ఎర్రచందనం దుంగల వాసన చూపిస్తే చాలు పట్టుకుంటాయని, వీటికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారన్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల ఆటకట్టించేందుకు ఈ జాగిలాల సేవలను అదనంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. టాస్క్‌ఫోర్సుకు ఐదు జాగిలాలు ఉన్నాయన్నారు. రెండు తిరుపతి, మిగిలిన మూడింటిని రైల్వేకోడూరు, కడపలో ఉపయోగించుకుంటారన్నారు. అనుమానిత ప్రాంతాలు, చెక్‌పోస్టులు తదితర ప్రాంతాల్లో జాగిలాలను ఉపయోగిస్తారన్నారు. ఎర్రచందనం దుంగలను డంప్ చేసిన ప్రాంతాలను కనుగొనేందుకు వీలుగా ఇవి పనిచేస్తాయన్నారు. గతంలో జాగిలాల సేవలు ఉపయోగించుకున్నట్లు ఆయన వివరించారు. ఎర్రచందనం దుంగ ముక్క చూపితే చాలు అలాగే పట్టుకుంటాయని తెలిపారు. రైల్వేకోడూరుకు గతంలో జాగిలాలను తీసుకుని వచ్చి రైల్వేస్టేషన్, చెక్‌పోస్టులు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేయించారు. తనిఖీల్లో పెద్దగా ఫలితాలు చూపలేదని అప్పటి అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న జాగిలాల పనితీరు బాగా ఉందని అధికారులు చెబుతున్నారు. టాస్క్‌ఫోర్సు జాగిలాలు తనిఖీలు చేసి పట్టుకుంటే పనితీరు విజయవంతం అయినట్లే అని సిబ్బంది చెబుతున్నారు. జాగిలాలతో అక్రమంగా వెళ్లే ఎర్రదుంగలను పసిగట్టేందుకు అధికారులు ప్రయోగాలు చేయడంతో స్మగ్లర్ల గుండెల్లో గుబులు పుట్టుకొస్తుందని సిబ్బంది చెబుతున్నారు.


జాగీలం పనితీరును పరిశీలిస్తున్న ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి

మూడోరోజు కొనసాగిన విచారణ

● ఆరుగురిని విచారించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కలెక్టర్
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫైర్ సర్వీస్ డైరెక్టర్




అధికారుల విచారణ అనంతరం సబ్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న ఉద్యోగులు

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలకమైన ఫైళ్ల దహనం ఘటనపై బుధవారం మూడోరోజు కూడా రెవిన్యూ, పోలీసు ఉన్నతాధికారులు విచారణ కొనసాగించారు. రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో పూర్వపు ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్‌లను జరిగిన సంఘటనపై పలు అంశాలలో విచారించారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ, భరత్‌రెడ్డి, వీఆర్‌ఏ రమణయ్యలను మరోమారు విచారించారు. అలాగే ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న రైస్ మిల్లు మాధవరెడ్డి, అతడి కుమారుడు మౌనీషరెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత తదితరుల పేరు మీద ఏయే భూములు రిజిస్ట్రేషన్ అయ్యాయి తదితర వివరాలను మదనపల్లె ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజును పిలిపించి విచారించారు. దీంతో పాటు సంఘటనా స్థలంలో కాలిపోయి మిగిలిన ఫైళ్లను, కంప్యూటర్ హార్డ్ డిస్కులను, సీపీయూలను, 30 మంది వీఆర్‌వోల సమక్షంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు పంచానామా రాసి స్వాధీనం చేసుకున్నారు. డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి తీసుకొచ్చిన ఫైళ్ల వివరాలను కూడా నమోదు చేసి భద్రపరిచారు.

మంటలు రావడానికి కారణాలపై విశ్లేషణ

మదపపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్ల దహనం ఘటనలో అగ్గిరాజుకోవడానికి, వేగంగా ఇతర సెక్షన్‌లకు విస్తరించడానికి గల కారణాలను రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ పి.వెంకటరమణ విశ్లేషిస్తున్నారు. ఘటనా స్థలానికి రెవిన్యూ చీఫ్ సెక్రటరీ సిసోడియాతో కలసి వెంకటరమణ పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిసింది. మదనపల్లె ఫైర్ సర్వీసు అధికారికి ఎప్పుడు ఫోన్ సమాచారం వచ్చింది, ఎంత సమయానికి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఎంత సేపటిలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. తదితర వివరాలను డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

పోలీసుల స్వాధీనంలోనే మొబైల్ ఫోన్లు

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న 20 మందికి పైగా ఉద్యోగుల మొబైల్ ఫోన్లను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరి మొబైల్ ఫోన్ల నుంచి ఘటన జరిగిన ముందు రోజు, సోమవారం ఎవరెవరికి కాల్స్ వెళ్లాయో, ఎంత సమయం మాట్లాడారో రాయచోటి, కడప నుంచి వచ్చిన పోలీసు టెక్నికల్ బృందాలు కాల్ డేటా తీస్తున్నారు. బుధవారం విధులకు వచ్చిన ఉద్యోగులను సీఐడీ, పోలీసులు, రెవిన్యూ అధికారులు వేర్వేరుగా విచారించారు. వారు ఏ సెక్షన్‌లలో పనిచేస్తున్నారు, ఏయే ఫైళ్లను వారు నిర్వహించారు. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 5 గంటలపైన ఉద్యోగులు ఇళ్లకు తిరిగి వెళ్లారు. కానీ వారి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు అప్పగించలేదని తెలిసింది.

మదనపల్లె చేరుకోనున్న సీఐడీ చీఫ్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనపై సోమవారం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుతో పాటు మదనపల్లె వచ్చిన సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ అదేరోజు విజయవాడకు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లా అండ్ ఆర్డర్ పోలీసులు, సీఐడీ పోలీసులు రెండురోజుల పాటు కొనసాగించిన దర్యాప్తు, అనుమానితుల విచారణ, సేకరించిన సాక్ష్యాలు, ఎఫ్ఎస్ఎల్ శాంపిల్స్ పరిక్షించిన రిపోర్టులు తదితర విషయాలను సమగ్రంగా విచారించడానికి సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి మదనపల్లె చేరుకోనున్నారు. వీటిపై గురువారం పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

నిర్లక్ష్యం వహించిన పోలీసులపై వేటు

మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఫైళ్ల దహనం ఘటనపై విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు పోలీసులపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వేటు వేశారు. సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లిన వన్‌టౌన్ సీఐ వల్లీబషు ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలపలేదు. అదేవిధంగా ఆ సమయానికి అదే ప్రాంతంలో బీట్ నిర్వహించిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు కూడా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదు. దీనిపై సీరియస్ అయిన ఎస్పీ వన్‌టౌన్ సీఐ వల్లీబషను వీఆర్‌కు బదిలీ చేయగా, ఇద్దరు బీట్ కానిస్టేబుళ్ల హరిప్రసాద్, భాస్కరయ్యను సస్పెండ్ చేశారు. వీఆర్‌లో ఉన్న బి.ప్రసాద్‌ను వన్‌టౌన్ సీఐగా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.


సబ్ కలెక్టర్ కార్యాలయం కిటికీ పక్కన పడిన కాలిన అవశేషాలను పరిశీలిస్తున్న ఫైర్ సర్వీస్ డైరెక్టర్ వెంకటరమణ

మదనపల్లెలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ విస్తృత పర్యటన

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటనపై విచారణకు వచ్చిన రాష్ట్ర రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడయా రెండో రోజు మదనపల్లె మండలంలోని వెంకప్పకోట, సీటీఎం-1 గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల్లో రెవిన్యూకు సంబంధించి ఎఫ్ఎల్ఆర్ రిజిస్టర్, అడంగల్, ఆర్‌వోఆర్ 1(బి), 10(1) డిజిటల్ సేవలు ఎలా నడుస్తున్నాయనే విషయమై సిబ్బందిని ప్రశ్నించారు. వెంకప్పకోట గ్రామంలో మ్యాపింగ్ చేసిన సర్వే రాళ్లను పరిశీలించారు. అనంతరం మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ రమాదేవి ఉన్నారు.


సీటీఎం-1 గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా, కలెక్టర్ శ్రీధర్

టీడీపీ నేతపై హత్యాయత్నం.. డీఎస్పీ విచారణ

● కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ ● నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడి


గిరి నాయుడు ఇంటిలో దుండగులు వదిలి వెళ్లిన తుపాకీ

పీలేరు, జూలై 24: పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లులో టీడీపీ నేత గిరి నాయుడిపై జరిగిన హత్యాయత్న ఘటనపై రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు బుధవారం విచారణ చేపట్టారు. హత్యాయత్నం జరిగిన గిరినాయుడు ఇంటిని పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి, రాయచోటి నుంచి వచ్చిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. అంతకు మునుపు సంఘటన గురించి, వచ్చిన ఆగంతకులు, వారు వ్యవహరించిన తీరు గురించి గిరినాయుడిని అడిగి తెలుసుకున్నారు. తనపై దాడి చేయడానికి వచ్చిన ఆగంతకులు ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లవ్స్ ధరించినట్లు పోలీసులకు వివరించారు. ఆ మేరకు గిరినాయుడు వేలిముద్రలు సేకరించేందుకు కూడా వేలిముద్రల నిపుణులు ఇబ్బంది పడినట్లు తెలిసింది. తాను వారితో ప్రతిఘటించిన తరువాత వారు తమ వెంట తెచ్చుకున్న ఐదు ద్విచక్ర వాహనాల్లో రాయచోటి వైపు వెళ్లిపోయినట్లు తెలపడంతో డీఎస్పీ రామచంద్ర రావు, సీఐ మోహన్ రెడ్డి ఒంటిల్లు సమీపంలోని టోల్ ప్లాజాకు చేరుకుని అక్కడ ఉన్న సీసీ టీవీలు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గిరినాయుడు ఉదంతంలో సమగ్రంగా విచారణ ప్రారంభించామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పాటు సంఘటన జరిగిన సమయంలో గిరినాయుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న సెల్‌ఫోన్ వివరాలను కూడా సేకరిస్తున్నామన్నారు. ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా చర్యలు చేపడతామన్నారు. తమ నేతపై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలియడంతో పీలేరు మండలానికి చెందిన పలువురు టీడీపీ నేతలు బుధవారం గిరినాయుడిని పరామర్శించారు.

అసాంఘిక శక్తుల అడ్డాగా పొంతలచెరువు క్రాస్

గిరినాయుడిపై హత్యాయత్నం ఘటనలో పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ పొంతలచెరువు క్రాస్‌లో నెలకొన్న అసాంఘిక పరిస్థితులే కారణమని ఒంటిల్లు గ్రామస్తులు ఆరోపించారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు సాగించిన రాజకీయాల కారణంగా పొంతలచెరువు క్రాస్ ప్రాంతం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిపోయిందని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావలిపల్లె పంచాయతీకి చెందిన కొంతమంది వైసీపీ నేతలు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని పొంతలచెరువు క్రాస్‌లో పేకాట, క్రికెట్ బెట్టింగ్, మందుబాబులకు మందు పార్టీలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చివేశారని వారు తెలిపారు. పీలేరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని మందుబాబులు, పేకాట రాయుళ్ల తమ కార్యకలాపాలు సాగించుకోవడానికి పొంతలచెరువు ప్రాంతాన్ని ఎంచుకుంటూ ఉంటారు. పీలేరు పట్టణం నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఖరీదైన కార్లు పొంతల చెరువు క్రాస్ ప్రాంతంలో చక్కర్లు కొడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అక్కడ ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతంలోనే అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు పోలీసుల దృష్టికి తెచ్చారు. ఇప్పటికైనా తమ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, అసాంఘిక కార్యక్రమాలు తగ్గించాలని ఒంటిల్లు గ్రామస్తులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.


గిరి నాయుడిని విచారిస్తున్న డీఎస్పీ, సీఐలు


కాల్పుల యత్నం జరిగిన గిరి నాయుడు ఇల్లు

ఫైళ్ల దహనం ఘటనపై సమగ్ర విచారణ : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మదనపల్లె అర్బన్, జూలై 24: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటపై సమగ్ర విచారణ చేస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఫైళ్ల దహనంపై వివిధ శాఖల అధికారులను ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి ఇతరులను ఎవ్వరినీ అనుమతి ఇవ్వకుండా సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల నిపుణులచే పరిశీలించామన్నారు. ఇందులో పోలీసులు, విద్యుత్ శాఖ, అగ్నిమాపక శాఖ, గతంలో ఎలక్ట్రికల్ వైరింగ్ నిర్వహించిన వారి నుంచే కాకుండా వివిధ డిపార్టుమెంట్‌ల వారి నుంచి రిపోర్టు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఇతరుల కుట్ర కోణం ఉందా లేదా అని తెలియజేయడానికి ముందుగా ఎలాంటి మెటీరియల్ వాడారు, ఇక్కడ యాక్టివ్‌గా ఉన్న పర్సన్ ఎవ్వరు, డేటా ఏ విధంగా కలెక్ట్ చేయాలో అనే కోణంలో దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు. కార్యాలయం బయట 21 కెమెరాలు, లోపల 19 కెమెరాలు ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 35 మంది అనుమానితులను గుర్తించి వారి కాల్ డేటా తీసుకుని 12 టీంలుగా విచారణ చేపట్టామని త్వరలోనే విచారణ పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ విధంగా ప్రమాదం జరిగిందని ఇప్పుడే చెప్పలేము. విచారణలో ఎలాంటి కోణాలు వచ్చినా ముందుగా మీడియాకు తెలియజేస్తామన్నారు. 25 రకాల భూములకు సంబంధించిన ఫైళ్లు ఆ విభాగంలో ఉంటాయని ఎంతవరకు దగ్ధమయ్యాయన్న విషయం విచారణలో తేలుతుందన్నారు. దాదాపుగా 700 ఫైల్స్ కాలినవి అధికారులకు ఇచ్చామని తెలిపారు. కార్యాలయంలో డీజిల్ క్యాన్ ఉండడం వాస్తవమేనని, సిబ్బంది తన బండి కోసం ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపారు. ఆ కోణంలో కూడా విచారణ చేస్తామని వివరించారు. రెవెన్యూ శాఖ అధికారులతో ఏయే ఫైళ్లు అందులో ఉండవచ్చు వాటి ప్రాముఖ్యత ఏమిటి ఏమి కాలిపోయాయో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పోలీసుల నిర్లక్ష్యం కారణమని సీఐను వీఆర్‌కు పంపగా ఇద్దరు కానిస్టేబుల్స్‌ను సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి బాధ్యతల స్వీకరణ

రాజంపేట, జూలై 24: రాజంపేట సబ్ కలెక్టర్‌గా వైఖోమ్ నిదియాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీవో మోహన్‌రావు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జిల్లా పరిషత్ సీఈవోగా పనిచేస్తూ రాజంపేటకు బదిలీపై వచ్చారు. ఆమె భర్త మేఘస్వరూప్ మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించగా నిదియాదేవి రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలోనే ఈ ఏడాది జనవరి 18వ తేదీ మేఘస్వరూప్ కమిషనర్‌గా, నిదియాదేవి జడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఏడు నెలల్లోనే నూతన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా వారిద్దరూ మదనపల్లె, రాజంపేట సబ్‌కలెక్టర్‌లుగా వచ్చారు. ఈ సందర్భంగా నూతన సబ్ కలెక్టర్‌ను ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, పలువురు తహసీల్దార్లు సన్మానించారు.


బాధ్యతలు స్వీకరించిన వైఖోమ్ నిదియాదేవి

సిరికల్చర్ రీలింగ్ యూనిట్ల కేటాయింపుపై ప్రత్యేక కమిటీ విచారణ


సిరికల్చర్ కాలనీలో రీలింగ్ యూనిట్ల స్థితిగతులను తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె పట్టణం సిరికల్చర్ కాలనీలో ఇటీవల 11 మందికి రీలింగ్ యూనిట్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదు మేరకు ప్రత్యేక కమిటీ బృందం విచారణ చేపట్టింది. బుధవారం స్థానిక సిరికల్చర్ కాలనీ వద్ద కమిటీలోని సభ్యులు సిరికల్చర్ ఏడీలు రామ్మోహన్, సరోజ, సైంటిస్ట్ బి.దీపక్ చౌదరి, డీఎస్‌వో రవినాయక్, ఏడీ బీటీసీఎస్ శర్మలు పలు అంశాలపై విచారణ చేపట్టారు. సిరికల్చర్ కాలనీలో ఖాళీగా ఉన్న 11 యూనిట్ల స్థలాలను ఇటీవల కొందరికి ఉన్నతాధికారులు కేటాయించిన విషయం తెలిసిందే. కానీ ఈ స్థలాలను అర్హులకు కేటాయించలేదని, అనర్హులకు కేటాయించారని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ బాధితులతో కలసి రాష్ట్ర సిరికల్చర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దీనిపై విచారణ చేపట్టడానికి సత్యసాయి జిల్లా సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ పద్మమ్మ చైర్మన్‌గా ఓ కమిటీని కమిషనర్ నియమించారు. ఈ నేపథ్యంలో కమిటీలోని నలుగురు అధికారులు సిరికల్చర్ కాలనీలో లబ్ధిదారులను, బాధితులను విచారించారు. ఆ కాలనీలో ఉన్న 50 ప్లాట్లను పరిశీలించారు. అక్కడ రీలింగ్ యూనిట్లు ఉన్నాయా, నిర్వహణలో ఉన్నాయా, ఎవరి అధీనంలో ఉన్నాయి అనే విషయాలను తనిఖీ చేశారు. ఏవైనా యూనిట్లు రీలింగ్‌కు కాకుండా ఇళ్లకు కేటాయించారా అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీనిపై సిరికల్చర్ రెగ్యులర్ ఏడీ రామ్మోహన్ మాట్లాడుతూ దీనిపై శుక్ర, శనివారాల్లో కూడా క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నేడు భూవివాదాల సమస్యలపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ పరిష్కార వేదిక

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలో భూవివాదాలు, రెవిన్యూ సమస్యలపై గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినతులను స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా స్వయంగా పరిశీలించి, పరిష్కారం చూపుతారన్నారు. రెండు నుంచి మూడేళ్ల భూవివాదాలు ఉంటే ప్రజలు వివరాలతో వచ్చి వినతులు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

ఇడుపులపాయలో ఒంగోలు ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్లు ప్రారంభం

● మొదటి రోజు 456 మందికి ప్రవేశాలు


మాట్లాడుతున్న వీసీ విజయ్‌కుమార్

వేంపల్లె, జూలై 24: ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సులో చేరేందుకు అడ్మిషన్ కౌన్సెలింగ్‌ను వేంపల్లె మండలం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీట్లు రావడం తల్లిదండ్రులు చేసుకున్న అదృష్టమని తెలిపారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు వసతి కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తరచూ క్యాంపస్‌ను సందర్శించి వారి బాగోగులు, చదువు గురించి తెలుసుకోవాలని వీసీ సూచించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివితే విజయం మీదేనని విద్యార్థులకు వీసీ ఉద్బోధించారు. ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో టాపర్‌గా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం తరిబల్లి గ్రామానికి చెందిన ఎం.మేఘనకు వీసీ విజయ్‌కుమార్ మొదటి అడ్మిషన్ ఫైల్‌ను అందించారు. అనంతరం యథావిధిగా అడ్మిషన్ ప్రక్రియ కొనసాగించారు. 586మంది విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపగా 456 మంది అడ్మిషన్ పొందినట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్రకుమార్ తెలిపారు. 130సీట్లు మొదటి రోజు మిగిలాయని తెలిపారు. అడ్మిషన్ పొందిన అందరు విద్యార్థులకు తరగతి గదులు, హాస్టల్ గదులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఇడుపులపాయ, ఒంగోలు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్ పటేల్, ఏఓలు రవికుమార్, శ్రీనివాస్, డీన్‌లు రత్నకుమారి, రూపస్ కుమార్, బిన్ని తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో అధ్యాపకుల కొరత

ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో రెగ్యులర్ అధ్యాపకుల నియామకం కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీల్లో అధ్యాపకుల కొరత ఉందన్నారు. రెగ్యులర్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చామని, పలువురు దరఖాస్తు చేసుకున్నారని అయితే దీనిపై కొందరు కోర్టులో కేసులు వేయడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బట్టి ముందుకెళ్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాకల్టీతోనే మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని వీసీ తెలిపారు.

పశువులు చనిపోతున్నా... పట్టించుకోరా?

● వైద్యులు సక్రమంగా రారు.. వైద్యానికి మందులు ఉండవు.. వ్యాక్సినేషన్‌లో జిల్లా వెనుకబాటు ● పశుసంవర్ధకశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై రైతుల ఆగ్రహం.. ఆందోళన





జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ప్లకార్డులు చేతపట్టి నినదిస్తున్న రైతులు, సమస్యలపై అధికారులను నిలదీస్తున్న రైతులు

కడప(రూరల్) జూలై 24: జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై బుధవారం రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. బుధవారం కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఒంగోలు, పుంగనూరు గో జాతి అభివృద్ధి జిల్లా కన్వీనర్ సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, కో-కన్వీనర్ పుత్తా వెంకటసుబ్బారెడ్డి (మాజీ కార్పొరేటర్) ఒంగోలు జాతి పశుపోషకులు వి.విశ్వనాథరెడ్డి (పొలతల మాజీ చైర్మన్), జి.వెంకటస్వామి, ఆర్.రాజశేఖర్‌రెడ్డి తదితరుల అద్వర్యంలో పెద్ద సంఖ్యలో రైతులు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం 11-30 గంటల ప్రాంతంలో జేడీ శారదమ్మ, పలువురు డీడీలు, ఏడీలతో సమస్యలపై ఏకరువుపెట్టారు. ప్లకార్డులు చేతపట్టి అధికారుల నిర్లక్ష్యపు చర్యలను ఎండగట్టారు. జిల్లాలోని పలు పశువైద్యశాలల్లో డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని మండిపడ్డారు. పైగా ప్రతి వైద్యానికి మందులు లేవని దాటవేస్తున్నారని.. దీంతో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర పశువులు మృత్యువాత పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాలో పశువులకు రక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. వ్యాధినిరోధక టీకాలు, పశువుల గర్భదారణ విషయంలో, డాక్టర్ల సర్వీసు విషయంలో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. ఈ కారణంగా పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గతప్రభుత్వంలో రూ.30 కోట్లు వెచ్చించి వ్యాక్సినేషన్ నిల్వల కోసం ఫ్రిజ్జులు కొనుగోలు చేశారని... ఇందులో పెద్ద అవినీతి జరిగిందన్నారు. ఇక సరైన సమయంలో వైద్యులు స్పందించక రూ.లక్షలు విలువ చేసే గిత్తలు ఉన్నఫలంగా చనిపోతున్నాయని.. వీటికి బీమా సౌకర్యం లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గిత్తలకు రూ.5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

జిల్లాలోని పశుగణాభివృద్ధి కమిటీలో ఉన్న సభ్యులకు ఎవరికీ పశువులు లేకున్నా.. బైలాకు విరుద్ధంగా కమిటీ సభ్యులుగా నియమించడం చట్టవిరుద్ధమన్నారు. ఈ కమిటీవలన పశుపోషణకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. వెంటనే వారిపై విచారణ జరిపించి కమిటీని రద్దుపరచాలన్నారు. గిత్తల పెడిగ్రీ లేకుండా ఏపీఎల్‌డీఏ నాణ్యతలేని గిత్తల సెమెన్ సరఫరా చేస్తున్నారని ఇది పెద్ద దగా అన్నారు. పాడిపశువులకు ఎన్నిసార్లు సెమెన్ వేసినా చూడి కట్టక వధశాలకు వెళ్తున్నాయన్నారు. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదన్నారు. మందుల కొరత వేధిస్తోందన్నారు. వ్యాక్సినేషన్‌ను సరైన సమయంలో వేయకపోవడం వలన వందలాది పశువులు మరణిస్తున్నాయన్నారు. రైతుల వాదనలను అధికారులు తేలిగ్గా తీసుకోవడంతో అర్థాంతరంగా చర్చను ముగించి తదుపరి ఉద్యమ కార్యాచరణను వెల్లడిస్తామని వెళ్లిపోయారు. కాగా, అంతకు ముందు కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పశుసంవర్ధకశాఖలో సాగిన అవినీతి బాగోతంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పై ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శారదమ్మ తెలిపారు. వ్యాక్సినేషన్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తుంటాయని.. వచ్చిన వాటిని ఆయా కాలాల్లో ప్రాధాన్యతా క్రమంగా వేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. పశువులకు దాణా, పిల్లపెసర, ఉలవలు సబ్సిడీపైన అందించాలని రైతులు కోరగా.. పై అధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు డీడీలు, ఏడీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటిన్ ఏర్పాటుపై స్థల పరిశీలన



జడ్పీ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రత్నాల రావు

కడప(రూరల్) జూలై 24: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుటారు. ఈ మేరకు ఆగస్టు 15 నాటికి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు కడప కార్పొరేషన్ అధికారులు తగు చర్యలను వేగవంతం చేశారు. గత 2014-19 టీడీపీ పాలనలో జిల్లా ప్రజాపరిషత్తు కార్యాలయం స్థలంలోని మెయిన్ రోడ్డులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు భోజనం అందించారు. తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో దాన్ని మూసివేశారు. తిరిగి యధాస్థానంలో అన్న క్యాంటీన్‌ను కొనసాగించడానికి బుధవారం కడప నగరపాలక సంస్థ ఎస్ఈ రత్నాలరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కడప నగరంలోని మూడు ప్రాంతాలలో అన్న క్యాంటీన్లు ఏర్పటు చేయడానికి భవనాలు అనువుగా ఉన్నాయన్నారు. ఇందులో జడ్పీ ఆవరణలోని స్థలం ఒకటన్నారు. ఇక్కడ త్వరలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అరికట్టాలి



ఏఎస్పీ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ

కడప (నాగరాజుపేట), జూలై 24: జిల్లాలో జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని జిల్లా విద్యుత్‌శాఖాధికారి రమణ కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ సూపరింటెం డెంట్ ఆఫ్ పోలీసు (ఏఎస్పీ) సుధాకర్‌ను ఆయన ఆఫీసులో బుధవారం కలిసి అధికార లేఖను అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి వాటిలోని కాపర్ వైరును చోరీ చేస్తున్నారన్నారు. దీంతో రైతులు సాగు చేస్తున్న పంటలకు, సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని.. వీటిని అరికట్టాలని కోరారు.

పుష్పగిరి క్షేత్రంలో పురావస్తు అధికారులు



ఆలయ పరిధిలో పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

వల్లూరు, జూలై 24: పుష్పగిరి క్షేత్రాన్ని బుధవారం కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంటు ఇంజనీరు భాను ప్రకాశ్‌శర్మ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా కొండపైన చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కలియ దిరిగి దెబ్బతిన్న గోపురాలను పరిశీలించారు. మరమ్మత్తులు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కొండపైన భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్ల నిర్మించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వీరి వెంట జిల్లా సీఏ బాలక్రిష్ణారెడ్డి, సర్వేయరు ఫణీంద్ర, పురావస్తుశాఖ సిబ్బంది, స్థానిక పూజారులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ పనులను నిలుపుదల చేయకపోతే

29 నుంచి పసుపు కొనుగోళ్లు నిలిపివేత

కడప(రూరల్) జూలై 24 : కడప పసుపు మార్కెట్ యార్డు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పండ్ల వ్యాపారాన్ని సాగించేందుకు ఏర్పాటు చేస్తున్న పనులను తక్షణమే నిలుపుదల చేయించకపోతే జూలై 29 నుంచి మార్కెట్‌యార్డులో పసుపు కొనుగోళ్లను నిలిపివేస్తామని కడప పసుపు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎం. రామక్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్‌ను కలెక్టర్‌కు, మార్కెట్‌యార్డు జేడీకి, సెక్రటరీకి, కడప ఎమ్మెల్యేకి తెలియజేశామన్నారు. పసుపు మార్కెట్ యార్డులో చట్టాల ఉల్లంఘన జరుగుతోందన్నారు. పసుపు మార్కెట్‌లోని గది నెంబర్ 16/329లో పసుపు, వేరుశనగ వ్యాపారం మాత్రమే కొనసాగించాలన్నారు. అలా కాకుండా ఒక వ్యక్తి పండ్ల వ్యాపారాన్ని నడుపుతున్నారని.. అందులో ఏసీని ఏర్పాటు చేశారన్నారు. గతంలో సెక్రటరీకి, జెడీని సంప్రందించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో పరిష్కారం చూపకపోతే జూన్ 29 నుంచి వ్యాపారాన్ని నిలిపివేయాల్సి వస్తుందన్నారు. అలాగే పసుపు మార్కెట్ యార్డులో ఒక షెడ్ నిర్మాణంలో ఉందని 4 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. మార్కెట్ నిర్వహణ అధ్వానంగా ఉందని.. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



చంద్రశేఖర్ మృతదేహం

పోరుమామిళ్ల, జూలై 24: రంగసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్నకాలనీకి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని చంద్రశేఖర్ (35) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఆ పరిసర ప్రాంతాల్లో బిందెల వ్యాపారం చేసుకుంటున్న యువకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తిమోతి సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన చంద్రశేఖర్ పోరుమామిళ్లలోని బలిజకోట వీధిలో పండుల వ్యాపారం చేసుకుంటున్న సరస్వతిని కొన్ని సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె సంతానం. చంద్రశేఖర్ కొంత కాలం భార్యతో కలిసి ఉన్నాడని, గత రెండు మూడేళ్ల నుంచి ఇంటికి వెళ్లకుండా కర్నూలు జిల్లాలోని ఆత్మకూరులో బేల్దారి పనులు చేసుకుంటుండేవాడు. ఇటీవల పోరుమామిళ్లకు వచ్చినా ఇంటికి సరిగా వెళ్లేవాడు కాదు. మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

59 దుంగలు స్వాధీనం...నలుగురు అరెస్టు



ఎర్రచందనం దుంగలు, పట్టుబడిన నిందితులు

గోపవరం, జూలై 24: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 59 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. నెల్లూరు-బద్వేలు ప్రధాన రహదారిలో పీపీకుంట వద్ద రేగిమానువంకకు సమీపంలో దుంగలను తరలించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో తమ సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 59 దుంగలతో పాటు టాటాఏస్ వాహనం, రెండు మోటరు సైకిళ్లను సీజ్ చేశామన్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన రసూల్, ప్రసాద్, చిన్నాతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశాన్నారు. దుంగలతో పాటు వాహనాల విలువ రూ.21లక్షలు ఉంటుందన్నారు. నిందితులను తిరుపతి కోర్టుకు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విక్రమ్‌సింహ, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

కడప (క్రైం), జూలై 24: కడప నగరం శంకరాపురం, కోటిరెడ్డిసర్కిల్ సమీపంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇరువురు గాయపడ్డారు. కోటిరెడ్డిసర్కిల్ వద్ద సీకేదిన్నె మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన మల్లిఖార్జునరెడ్డి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మరో వాహనం వచ్చి ఢీకొనడంతో కాలుకు గాయమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అలాగే కడప శంకరాపురం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కేసీ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

కడప (క్రైం), జూలై 24 : కడప నగరంలోని అల్మాస్‌పేట యానాదికాలనీకి చెందిన యాకసిరి నరసయ్య (51) కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మరణించాడు. అతని భార్య అంకమ్మ ఫిర్యాదు మేరకు.. తన భర్తకు అప్పుడప్పుడూ ఫిట్స్ వచ్చేవని, కాగితాలు, ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుని సాయంత్రానికి వాటిని అమ్ముకుని జీవనం సాగించేవాడని, సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం స్థానికంగా ఉన్న వారు పోలీసుల ద్వారా తన భర్త మృతి చెందినట్లు సమాచారం అందించారని తెలిపారు. అనారోగ్యంతోనే కేసీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు.

వృద్ధురాలిపై దాడి చేసి ఇంట్లో చోరీ

పీలేరు, జూలై 24: ముగ్గురు గుర్తు తెలియని దుండగులు వృద్ధురాలిపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి పీలేరు-మదనపల్లె మార్గంలోని హుమ యూన్ కల్యాణ మండపం వద్ద తన తల్లి కె.ఎస్. జెహరాబీ(60)తో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బోదేషావలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి బోదేషావలి ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంటిలో ఉన్న రూ.60 వేల నగదుతోపాటు తన తల్లి ఒంటిపై ఉన్న రూ.3 లక్షలు విలువజేసే ఒక బంగారు చైను, రెండు చేతి గాజులు, రెండు కమ్మలు, రెండు ముక్కుపుడకలు దుండగులు దోచుకెళ్లినట్లు బోదేషావలి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి

● జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు, జూలై 24: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య పనుల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సభాభవనంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను తప్పనిసరి చేయాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. భూతల జలాశయాలు, మినరల్ వాటర్‌ప్లాంటుల్లో పదిహేనురోజులకొకసారి క్లోరినేషన్ చేయాలన్నారు. రోజువారి పారిశుధ్య పనులను నిర్వహించాలని... వాటిని రిజిస్టరులో నమోదు చేయాలని సూచించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారితో మమేకమై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మురుగునీటి కాల్వలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా ఈ సీజనులో డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. మండలంలోని కార్యదర్శులు పీఆర్1 యాప్‌ను, హౌస్‌ట్యాక్స్‌ను, ఓడీఎఫ్ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి వారం రోజుల్లో పూర్తి నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ అధికారి రమణారెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ముజీబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి : డీఆర్‌డీఏ పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

రామాపురం, జూలై 24: గ్రామాల్లో ఉన్న స్వయం సహాయక సంఘాలు బలోపేతానికి అందరూ కృషి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో స్వయం సహాయక కార్యాలయంలో బుధవారం ఎంఎస్‌వోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేయాలన్నారు. వారి అవసరాల నిమిత్తం బ్యాంకుల్లో శ్రీనిధి రుణాలు, వ్యక్తిగత రుణాలు ఇప్పించడంలో సీసీలు కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లో నియమించిన వీవోఏలు సంఘం వద్దకు పోయి వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారా లేదా అన్న విషయాలను ఖచ్చితంగా పుస్తకాలలో పొందుపర్చాలని సూచించారు. ఎక్కడైనా గ్రూపులు రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకపోతే.. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డబ్బులు తిరిగి చెల్లించే విధంగా చూడాలన్నారు. గ్రామ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత వీవోతో పాటు సీసీలు కూడా తప్పకుండా హాజరుకావాలని.. వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కార్యక్రమంలో సీసీలు నాగభూషణ్‌రెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, నాగరాజు, ఆదినారాయణ, ప్రసాద్, ఎంఎస్‌వో, వీవోబీలు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం : డీఈవో



విద్యార్థులతో కలిసి క్రీడలాడుతున్న డీఈవో శివకుమార్‌రెడ్డి

రామాపురం, జూలై 24: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నమయ్య జిల్లా డీఈవో శివకుమార్ రెడ్డి అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గువ్వలచెరువు తెలుగు, ఉర్దూ, నీలకంఠ్రావుపేట తెలుగు, ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. ఈ నెల 22 నుంచి 29 వరకు జరిగే భారతీయ సాంప్రదాయానికి చెందిన ఆటలను పర్యవేక్షించారు. వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం ఆయన నీలకంఠ్రావుపేట తెలుగు హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు సబ్జెక్టు వారీగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణతశాతం పెంచాలన్నారు. పాఠశాలకు సంబంధించిన మౌలిక సదుపాయాల గురించి హెడ్మాస్టర్ సుజాతమ్మను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సంబంధించిన బుక్స్, షూస్, డ్రస్సులు పంపిణీ చేశారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, పాఠశాల పీడీ నాగేందర్‌రెడ్డి, డీవో ఆఫీస్ సీసీ అబిబ్, పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం

ఇరిగేషన్ మినిస్టరుతో చర్చించిన కడప ఎమ్మెల్యే మాధవి



ఇరిగేషన్ మినిస్టరుతో చర్చిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డిలు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం ఇరిగేషన్ మినిస్టరు రామానాయుడును కడప నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్.మాధవీ, కడప పార్లమెంటు అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు బుధవారం కలిసి చర్చించారు. ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధులతో పెన్నానదిపై తలపెట్టిన చెక్‌డ్యాంలు నిర్మాణం చేయాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో నీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఆ సమయంలో పట్టించుకునే నాధుడే లేరని అన్నారు. కడప నగర ప్రజల తాగునీటి శాశ్వత పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా వారు మంత్రిని కోరారు.

అత్తింటివారే నా కూతురిని కొట్టి చంపేశారు

● పోలీసులకు మహిళ ఫిర్యాదు



సాయిప్రియ వివాహంనాటి ఫొటో (ఫైల్)

మదనపల్లె అర్బన్, జూలై 24: తన కూతురిని అత్తింటివారు కొట్టి చంపేశారంటూ లక్ష్మీదేవి అనే మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...

నీరుగట్టువారిపల్లె సమీ పంలోని బాబుకాలనీకి చెందిన శ్రీనివాసులు కుమా రుడు మణికంఠ, పట్టణంలోని రాంనగర్‌కు చెందిన లక్ష్మీదేవి కుమార్తె సాయిప్రియాంక (24) ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంత కాలానికి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. మద్యానికి బానిసలైన భర్తతో పాటు, మామ శ్రీనివాసులు డబ్బు కోసం సాయి ప్రియాం కను హింసించేవారు. రూ.5లక్షలు డబ్బు తీసుకు రావాలని రెండు నెలలుగా ఆమెను ఇబ్బంది లకు గురిచేస్తూ సక్రమంగా భోజనం చేయనిచ్చేవారు కారని లక్ష్మీదేవి ఫిర్యా దులో పేర్కొంది. మంగళవారం రాత్రి భర్త మణికంఠ, మామ శ్రీనివాసులు, అత్త ఉష, తాత మునెప్ప కలిసి సాయిప్రియాంకను కొట్టి చంపేసి, కమ్మికు చీరతో ఉరివేశా రని, అనంతరం తన అల్లుడు తనకు ఫోన్ చేసి నీ కూతురు చనిపోయిందని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు.

వివాదాస్పద భూమి పరిశీలన



వివాదాస్పద స్థలంలో సర్వే నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

సుండుపల్లె, జూలై 24: మండల కేంద్రానికి సమీపంలోని బుర్రలదిన్నెపల్లెలో గ్రామ కంఠం ఆక్రమించి గోడ కట్టాలని స్థానికులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి పలువురు జిల్లా, మండల అధికారులకు నోటీసులు రావడంతో జిల్లా సర్వేయర్ జయరాజ్ బుధవారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో స్థలాన్ని సర్వే నిర్వహించారు. అయితే తిరిగి శుక్రవారం సర్వే చేసి వివాదాస్పదంగా మారిన స్థలం ప్రభుత్వ భూమిలో ఉందా పట్టా భూమిలో ఉందా అనే విషయాన్ని చెబుతామన్నారు. డీఐవో బాలాజీ, ఐవోఎస్ ప్రసాద్‌రావు, తహసీల్దార్ జరీనాబేగం, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్‌కేఎం హుస్సేన్, సర్వేయర్ రక్షిత, ఆర్‌ఐ రాంబాబు, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అగ్రపీఠం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అగ్రపీఠం వేయడంతో ఆంధ్రుల కలలు నెరవేరాయని అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి ఎంతో ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీకి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌పై రాష్ట్ర ప్రజలు ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని కొనియాడారు. చంద్రబాబుతో ఇక మన రాష్ట్రానికి అంతా మంచే జరుగుతుందని తెలిపారు. ఏపీకి నిధులు కేటాయించిన ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి



సమస్యలపై ఆరాతీస్తున్న రాహుల్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 24: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ వాసుబాబుతో కలిసి రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట, ఆకులవీధి, వరిగిరోడ్డు, ఎల్‌ఐసీ కాలనీ ఇతర ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి పైపులైన్, డ్రైనేజీ సమస్యలపై ఆరాతీశారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రధాన సమస్యలను గుర్తించామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు డ్రైనేజీ సమస్య లేకుండా పరిష్కరిస్తామన్నారు.

వరి పంట పొలాల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దవటం, జూలై 24: వంతాటిపల్లి గ్రామంలోని వరి పొలాలను వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి, వ్యవసాయ సంచాలకులు ప్రేమ్‌కుమార్, శివకుమార్‌లు బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా అక్కడక్కడ కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టు పురుగును పరిశీలించారు. వాటి నివారణకు క్లోరోపైరీ పాస్ అనే మందును ఒక లీటరు నీటికి 2ఎంఎల్ చొప్పున, కార్బో ఫ్యూరాన్ 3జి గులికలను ఎకరానికి 10 కిలోల చొప్పున ఇసుకతో కలిపి చల్లుకోవాలని రైతులకు సూచనలు చేశారు. పొలం నాటే సమయంలో వరినారు కొనలు తుంచి నాటాలని, తద్వారా కాండం తొలుచు పురుగు నివారించడం జరుగుతుందన్నారు. సస్య రక్షణకు వేప గింజల ద్రావణం వాడాలని తెలియజేవారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలువపై అక్రమంగా కల్వర్టు నిర్మాణం



అక్రమంగా నిర్మించిన కల్వర్టు

రాజంపేటటౌన్, జూలై 24: పట్టణంలోని ఉస్మాన్‌నగర్ ఎదురుగా ప్రభుత్వ కాలువ నిర్మాణంపై అక్రమంగా కల్వర్టు నిర్మించారు. ప్రధానంగా వైసీపీ పార్టీ కౌన్సిలర్ భర్త తన భూమికి రాకపోకల కోసం మురుగు కాలువపై ఎలాంటి అనుమతులు పొందకుండానే కల్వర్టును నిర్మించారు. పట్టణంలోని ప్రధాన కాలువ గుండా వచ్చే మురికినీరు అంతా ఈ కాలువ ద్వారానే చక్రాల మడుగులోకి వెళతాయి. అయితే మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండానే ఆ స్థల యజమాని రాత్రికి రాత్రే కల్వర్టు నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు సంబంధించి అనుమతుల కోసం ఎలాంటి దరఖాస్తులు తమ వద్ద లేవన్నారు. దీనిపై విచారణ జరిపించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

సంబేపల్లె, జూలై 24: ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మోటకట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి నేర్పించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, బంధుమిత్రులు నాగిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, సహదేవరెడ్డి, నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

చీకటివాండ్లపల్లెను వణికిస్తున్న విషజ్వరాలు

● భయాందోళనలో గ్రామస్తులు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి

రామాపురం, జూలై 24: మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెలో పిల్లలు విషజ్వరాల భారిన పడి అల్లాడిపోతున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో దోమల బెడద ఎక్కువై విషజ్వరాలు భారిన పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చి మొక్కలు, గుంతల్లో నీరు నిలవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలలో చదువుతున్న బలబాలికలకు సుమారు 20 మంది పిల్లలకు పైబడి వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు వచ్చాయి. వీరిలో నిశ్చిత, శ్రీధర్‌నాయుడు, ఉమేశ్ నాయుడు, ధ్రువిక, నందిని, మరో కొందరు చిన్నారులు చికిత్స కోసం కడపలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించి అక్కడ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రాయచోటి, కడప ప్రాంతాల్లో చికిత్స నిమిత్తం పిల్లలను తీసుకెళ్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. దీక్షిత అనే బాలికను రాయచోటిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా డెంగ్యూ జ్వరం అని డాక్టర్లు చెప్పినట్లు తెలిసింది. దీంతో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఎక్కువగా చిన్నపిల్లలకే జ్వరాలు, వాంతులు, విరేచనాలు రావడానికి తాగునీరు, దోమల వృద్ధే కారణంగా తెలుస్తోందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై స్థానిక వైద్యాధికారి వినోద్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రామంలో తమ సిబ్బంది పర్యటిస్తున్నారని, తాము గురువారం ఉదయాన్నే సిబ్బందితో వెళ్లి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి అన్ని రకాల పరీక్షలు చేస్తామని ఆయన తెలిపారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్

రాయచోటిటౌన్, జూలై 24: తపాలాశాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. తపాలాశాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాయచోటి పోస్టల్ డివిజన్ పరిధిలోని శిబ్యాల గ్రామం సబ్‌పోస్టాఫీసులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ సేవలు, పొదుపు, బీమా సేవలను సద్వినియోగం చేసుకుంటే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పోస్టాఫీసు సిబ్బంది, రోటరీ క్లబ్ సభ్యులు కృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సంబేపల్లె, జూలై 24: పంచాయతీ పరిధిలో ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో నిర్మలాదేవి సర్పంచులకు, సెక్రటరీలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియజేశారు. బుధవారం మండల పరిషత్ సభా భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉన్న చోట శానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. రానున్న వినాయక చవితి సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈవోపీఆర్‌డీ సునీల్‌కుమార్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచుల బాధ్యతలు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిన్నమండెం, జూలై 24: గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలెక్టర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశానుసారం మండల రెవెన్యూ సిబ్బంది చిన్నమండెం రెవెన్యూ పరిధిలోని కేశాపురం చెక్‌పోస్టు వద్ద తోపు పరంపోకు సర్వే నెంబరు 1693లో ఒక ఎకరాల 21 సెంట్లు, కేశాపురం బోనమల రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 1646లో 86 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, ఇందులో ఎవరైనా ప్రవేశిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ఆయిల్ ఫామ్ సాగుకు ప్రోత్సాహం



పంటను పరిశీలిస్తున్న అధికారులు

చిట్వేలి, జూలై 24: ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారిణి ఆషియా తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయిల్ ఫామ్ సాగుపై పోల్లో పల్లె సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిణి ఆసియా మాట్లాడుతూ మండలంలో వంద ఎకరాల్లో ఆయిల్‌ఫాం సాగు చేయడానికి నిర్దేశించామన్నారు. సువెన్ ఆగ్రో ఇండస్ట్రీ ప్రైవేటు లిమిటెడ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ సాగుకు ఉద్యానశాఖ శ్రీకారం చుట్టిందని, ఈ పంట 30 ఏళ్ల వరకు దిగుబడిని ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇప్పటికే సాగులో ఉన్న ఆయిల్‌ఫాం తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబు, రైల్వేకోడూరు ఉద్యాన అధికారి భాస్కర్, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీ ప్రతినిధి కొండారెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనాలి

సంబేపల్లె, జూలై 24: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో శిక్షా సప్తాహ్ విద్యా వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మొదలైన ఆటలు ఆడించారు. ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు పట్ల హర్షం

చిట్వేలి, జూలై 24: బడ్జెట్‌లో బాలికల సంక్షేమానికి రూ.3 లక్షల కోట్లు కేటాయించడం పట్ల బీజేపీ మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మలానంద లక్ష్మీ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం చిట్వేలిలో మాట్లాడుతూ ఈ కేటాయింపులు మహిళల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుందన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

● ఈవోపీఆర్‌డీ ఉషారాణి

రామాపురం, జూలై 24: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈవోపీఆర్‌డీ ఉషారాణి అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పనులను ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా బుధవారం కసిరెడ్డిగారిపల్లె, గువ్వలచెరువు, గోపగుడిపల్లె, బండపల్లి, చిట్లూరు, నీలకంఠ్రావుపేట తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. సూర్యనారాయణపురంలో సర్పంచ్, కార్యదర్శి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచులు ధనలక్ష్మి, కార్యదర్శి నాగవేణి, టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రెడ్డెయ్య, గాడి నరహరి పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ

సంబేపల్లె,జూలై 24: ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఆర్జించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. బుధవారం నాగిరెడ్డిగారిపల్లెలో జీఏపీ పొలంబడి శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో మమేకమై వేరుశనగ సాగులో రైతులు పాటించాల్సిన పద్ధతులపై తెలియజేశారు. ప్రతి రైతు ఈక్రాప్ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి రేనుక, రెడ్డివెంకట్రమణ, గ్రామ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అన్నమాచార్య కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



రాజంపేట, జూలై 24: మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో సహాయ అధ్యాపకుడిగా పని చేసిన ఎన్‌సీ అల్లూరయ్యకు వీఐటీ యూనివర్శిటీ వేలూరు వారిచే డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మల్టీ ఆప్టిమైజేషన్ అండ్ టెక్నో ఎకనామిక్ డిజైన్ ఆఫ్ ఏ హైబ్రిడ్ మైక్రోగ్రిడ్ సిస్టమ్ విత్ రెనోవబుల్ ఎనర్జీ సోర్సెస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత, డీన్స్ అల్లూరయ్యను అభినందించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి : వీహెచ్‌పీ

రామాపురం, జూలై 24: వెంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కదిరి కృష్ణపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లె వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, జిల్లా బజరంగ్‌దళ్ సేవా సంయోజక్ అధ్యక్షుడు వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రామాపురంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కోట్ల మంది భక్తులు ఉన్న వెంకటేశ్వరస్వామిపై ఇలాంటి వ్యాఖ్యలు దారుణమన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, దామోదర్ నాయుడు, వీరారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జయరాంరెడ్డి, వెంకట్రమణులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ఆశయం

పెనగలూరు, జూలై 24: ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాల అభివృద్ధి చేయడమే సీఎం చంద్రబాబు ఆశయమని టీడీపీ పార్లమెంట్ రైతు అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యనాయుడు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం చేపట్టిన 45 రోజుల్లోనే రాష్ట్రంలో ప్రధాన అభివృద్ధి పనులైన అమరావతి నిర్మాణం, పోలరం ప్రాజెక్టు అసంపూర్తి నిర్మాణం పూర్తి చేసేందుకు, సంపూర్ణంగా నిధులు రాబట్టేందుకు తనవంతు కృషి చేశారని కొనియాడారు. సమావేశంలో దామనచర్లకు చెందిన టీడీపీ నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎంపిక

రాయచోటిటౌన్, జూలై 24: సావిత్రిభాయి పూలే మహిళా ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీ బుధవారం పట్టణంలోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దాసరి విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా ఉషాసుందరి, ప్రధాన కార్యదర్శిగా శ్రీవిద్య, ఆర్థిక కార్యదర్శిగా మునిలక్ష్మి, తదితరులను ఎంపిక చేశారు.

వీరభద్రుడిని దర్శించుకున్న జేసీ

రాయచోటిటౌన్, జూలై 24: పట్టణంలోని దక్షిణ కాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని బుధవారం జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ రాజేంద్రన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన అర్చకులు స్వామి, అమ్మవార్ల విశిష్టత గురించి వివరించి పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

'గరికె' గణపతి



గరిక మాలలో గణపతి

నందలూరు, జూలై 24: నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వేఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకట చతుర్థి పురస్కరించుకుని గణపతిని గరికె మాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు సరస రవిస్వామి ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

ఏపీఎండీసీలో వైద్యశిబిరం

ఓబులవారిపల్లె, జూలై 24: మండలంలోని ఏపీఎండీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని సీపీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఆద్య మెడికల్ సర్వీస్ బృందంతో కలిసి తిరుపతి నుంచి ప్రత్యేక వైద్యబృందం విచ్చేసి సేవలు అందించినట్లు తెలిపారు. సాధారణ జ్వరాల నుంచి షుగర్, బీపీ, చిన్నపిల్లలకు సంబంధించిన వైద్యులైన డాక్టర్ సాయిరాం, డాక్టర్ వెంకటసాయి, డాక్టర్ రమేష్, డాక్టర్ నోయ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

వీరబల్లి, జూలై 24: మండల పరిధిలోని మట్లి పంచాయతీ ఆసాదివాండ్లపల్లె సమీపంలో జూదమాడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అదేవిధంగా వారి వద్ద నుంచి రూ.6,930 స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

పాఠ్యపుస్తకాల మంజూరుపై హర్షం

రైల్వేకోడూరు, జూలై 24: ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.బాలసుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం కళాశాలలకు పుస్తకాలను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పేద విద్యార్థిని, విద్యార్థుల కష్టాలను తెలుసుకుని వీటిని పంపిణీ చేసిందన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరి, నవదీప్, తేజ, రమణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాల వితరణ

రాజంపేట, జూలై 24: సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో డీఎం వెంకటరమణకు బుధవారం ఎన్డీఏ కూటమి సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేనపార్టీ నేత రామా శ్రీనివాస్, రాజంపేట, పీలేరు వయా సానిపాయి, టి.సుండుపల్లె మీదుగా త్వరలో ఆర్టీసీ బస్సు సర్వీసుల ఏర్పాటుపై డీఎం వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో కార్యాలయ సిబ్బంది, జనసేన నేత కత్తి సుబ్బరాయుడు, నంద్యాల రామయ్య, అబ్బిగారి గోపాల్, టీడీపీ మహిళా నేత వాణి, నీలి ఈశ్వరయ్య, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశాజనకంగా లేని కేంద్ర బడ్జెట్'

పుల్లంపేట, జూలై 24: పాత పన్ను విధానంలో కొనసాగుతున్న మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా లేదని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేంద్రనాథ్ తెలిపారు. గత పదేళ్లుగా ఆదాయపు పన్ను మినహాయింపు రెండున్నర లక్షలకే పరిమితమైందని, ఒకవైపు రూ.8 లక్షల లోపు ఆదాయం కల వారిని ఆర్థికంగా వెనుకబడిన వారిగానే పరిగణిస్తూ మరోవైపు రెండున్నర లక్షల ఆదాయం దాటినవారి నుంచి పన్నులు వసూలు చేయడం అన్యాయమన్నారు.

హత్యలు, దాడులపై చర్యలు తీసుకోవాలి

● రజక సంఘం జిల్లా నేతల డిమాండ్

రాయచోటిటౌన్, జూలై 24: రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న దాడులు, హత్యలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర, కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఎంవీ రమణలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న దాడులపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరుతూ వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర పాలకులకు, రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన పోలీసు యంత్రాంగానికి చేతులెత్తి వేడుకుంటున్నామని, తమ కులానికి చెందినవారు హత్యలకు గురికావడం వేదనకు గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా రజకులను ప్రభుత్వాలు ఎస్సీ జాబితాలోకి చేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమించాల్సిన పరిస్థితులు భవిష్యత్తులో నెలకొంటాయని, వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు



విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నందలూరు, జూలై 24: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలను అధ్యాపకులు విద్యార్థులకు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లె జడ్పీ బాలికల జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థినులకు బుధవారం ప్రిన్సిపల్ జయలలితకుమారి ఆధ్వర్యంలో అధ్యాపకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేంద్రప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, రవిశంకర్‌రెడ్డి, బోగా వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్ పాల్గొన్నారు.

'రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయం'

రాజంపేట, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.15 వేల కోట్లు కేటాయించి రాష్ట్రానికి ఒక సముచిత స్థానాన్ని కల్పించారని, చంద్రన్న సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరిగెడుతుందని టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నేతలు పరుశురాంనాయుడు, ఆజాద్‌బాషా, సూర్యనారాయణరాజు, ధర్మేంద్ర, శ్యాంప్రకాష్, వినయ్, గురు తదితరులు పాల్గొన్నారు.

ఏజీ గార్డెన్ ప్రజలు చేసిన పాపమేమిటి ?

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

రాయచోటిటౌన్, జూలై 24: మూడు వేలకు పైగా జనాభా కలిగి సుమారు 14 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఏజీ గార్డెన్ ప్రజలు చేసిన పాపం ఏమిటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాధనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఏజీ గార్డెన్‌లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రాయచోటి నడిబొడ్డుకు 2 కి.మీ. దూరంలో ఉన్న ఏజీ గార్డెన్‌లో సుమారు 14 సంవత్సరాలుగా 3 వేలకు పైగా జనాభా నివాసం ఉంటూ కూలి నాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద ప్రజలకు ఇప్పటి వరకు తాగేందుకు గుక్కెడు మంచి నీళ్లు ఇవ్వలేని స్థితిలో ఎందుకు ఉన్నారో పాలక వర్గాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతానికి ఒక్కొక్క ఇంటికి రెండు డ్రమ్ములు చొప్పున నీటిని నింపుతూ పది రోజులకు ఒకసారి ఆ నీటినే వాడుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపునిస్తామని ఆయన పాలక వర్గంతో పాటు అధికారులను హెచ్చరించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట : పోతుగుంట

రాజంపేటటౌన్, జూలై 24: కేంద్ర వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు ఆర్థిక సాయం అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆదినారాయణ, రమణ, వీవీ రమణ, రమణయ్య, యెద్దల రమణ, చాపల లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, రెడ్డిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెల్దిగానిపల్లెలో
టమోటా ప్రాసెసింగ్ యూనిట్



రైతులు, నేతలతో చర్చిస్తున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, జూలై 24: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో రూ.8.42 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టరు సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కడా పీడీ వికాస్‌మర్మత్‌తో కలిసి యూనిట్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రైతుసహకార సంఘం సభ్యులు, టీడీపీ నేతలతో చర్చించారు. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రైతు సహకార సంఘానికి వంద శాతం ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు నిబద్ధతతో యూనిట్ నిర్వహిస్తూ రైతులందరికీ మేలు జరిగేలా చూడాలని సూచించారు. సంఘ సభ్యులే సివిల్ వర్కర్లతో యూనిట్‌ను నిర్మించుకుంటే న్యాణ్యతతో పాటు త్వరితగతిన నిర్మాణం పూర్తవుతుందన్నారు. నాణ్యతను పర్యవేక్షించేందుకు కడ నుంచి ఇంజనీర్లను, ఇతర శాఖల నుంచి ఇద్దరు సభ్యులను పర్యవేక్షకులుగా నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూధన్‌రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, టీడీపీ నేతలు మునస్వామి, పత్రినారాణాచారి, ఆనందరెడ్డి, చలపతి, చిన్నికృష్ణ, సీతాపతి, రామ్మూర్తి, విశ్వనాథ్, వెంకటరమణ, సత్తి, సురేష్, రెడ్డిపురుషోత్తం, ఉమాపతి, చిన్నసురేష్, వెంకటాచలం, రైతు సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అమృత్ భారత్‌కు పది రైల్వే స్టేషన్ల ఎంపిక

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏకంగా పది రైల్వే స్టేషన్లకు తీపి కబురు ప్రకటించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ రెండు జిల్లాల పరిధిలో మొత్తం పది రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. తిరుపతి, రేణిగుంట, పాకాల , చిత్తూరు, శ్రీకాళహస్తి, మదనపల్లె రోడ్డు, పీలేరు, కుప్పం,గూడూరు, సూళ్ళూరుపేట స్టేషన్లు అవకాశం దక్కించుకున్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73 రైల్వే స్టేషన్లను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఈ ప్రాంతానివే పది స్టేషన్లు వుండడం గమనార్హం. అమృత్ భారత్ పథకం కింద ఇప్పుడున్న రైల్వే స్టేషన్లను పూర్తి స్థాయిలో తిరిగి అభివృద్ధి పరచనున్నారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, హంగులతో వీటిని తీర్చిదిద్దే అవకాశముంది. అయితే స్టేషన్ల వారీ అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. కొన్నేళ్ళ కిందటే ఈ ప్రాంతంలోని రైల్వే స్టేషన్లను ఆధునికీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా కేంద్రం అమృత్ పథకం కిందకు వీటిని చేర్చడంతో ఆధునికీకరణ, అభివృద్ధి పరంగా ఈ స్టేషన్లు మరో అడుగు ముందుకు వేయనున్నాయి. ఎంపికైన స్టేషన్లను పరిశీలిస్తే తిరుపతి, శ్రీకాళహస్తి స్టేషన్లు పుణ్యక్షేత్రాల కేటగిరీలో వుండగా గూడూరు, రేణిగుంట, పాకాల స్టేషన్లు జంక్షన్ కేంద్రాలుగా వున్నాయి. సూళ్ళూరుపేట తమిళనాడు సరిహద్దుల్లోనూ, కుప్పం కర్ణాటక సరిహద్దుల్లోనూ కీలక స్టేషన్లు. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు తమిళనాడు సరిహద్దుల్లో కీలక స్టేషన్ కాగా పీలేరు ఉమ్మడి చిత్తూరు జిల్లా నడిబొడ్డున ముఖ్యమైన స్టేషన్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వీటి ప్రాధాన్యతను బట్టే అమృత్ పథకం పరిధిలోకి వీటిని కేంద్ర ప్రభుత్వం చేర్చినట్టు భావించాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల దశ సమీప భవిష్యత్తులో సమూలంగా మారనుంది.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై ఊరేగిన వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), జూలై 24: కాణిపాకంలో బుధవారం సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి, సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలోని వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి వారి ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడ వీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. వందలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ పాల్గొన్నారు.



స్వర్ణరథంపై స్వామివారి ఊరేగింపు



ఆస్థాన మండపంలో సంకటహర గణపతివ్రతం నిర్వహిస్తున్న భక్తులు

వేలంద్వారా రూ.1.33 కోట్ల ఆదాయం

ఐరాల(కాణిపాకం), జూలై 24: కాణిపాక వినాయక స్వామి ఆలయానికి బుధవారం నిర్వహించిన వేలం ద్వారా రూ.1,33,83,499 ఆదాయం లభించినట్లు ఈవో వెంకటేశు తెలిపారు. ఈవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేలంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కును రూ.60లక్షలకు, వాహనాలను శుభ్రపరిచే హక్కును రూ.20,09,500కు, బస్టాండ్ వద్ద క్యాంటీన్ నిర్వహణ హక్కును రూ.49,90,999కు హెచ్చుపాటదారులు కైవసం చేసుకున్నారు. ఆలయానికి సంబంధించిన పాత బొలెరో వాహనాన్ని రూ2,20,000కు, లైటింగ్ షో వెనుక భాగంలో ఉన్న దుకాణం నెంబరు 1 నిర్వహణను రూ.81వేలకు, దుకాణం నెంబరు 2ను రూ.82వేలకు కైవసం చేసుకున్నారు. వారికి సంవత్సర కాల పరిమితి ఉంటుందని ఈవో తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, హేమేశ్వరబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిపై అనర్హత వేటు వేయండి

● బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

పుంగనూరు, జూలై 24: 'పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన, ఆయన భార్య స్వర్ణలత పేరుతో వివిధ ప్రాంతాల్లో ఉన్న 142 ఆస్తుల వివరాలు పొందుపరచకుండా మోసం చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలి' అంటూ బీసీవైపార్టీ అధినేత బి.రామచంద్ర యాదవ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ ఈ కేసును విచారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పుంగనూరులో పోటీ చేసిన రామచంద్రయాదవ్ దీనిపై మే 7వ తేదీన ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈనెల నాలుగోతేది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రామచంద్రయాదవ్ తరఫున హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉమేశ్‌చంద్ర కేసు దాఖలు చేశారు. బుధవారం విచారణకు వచ్చింది. పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డిని కోర్టు రిమార్కులు ఇవ్వాలని ఆదేశించగా ఆయన వివరాలు హైకోర్టుకు సమర్పించారు. కాగా, ఆ ఎన్నికల్లో పెద్దిరెడ్డి తర్వాత అత్యధిక ఓట్లు వచ్చిన టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని కూడా ఈ కేసు విచారణలో భాగస్వామి చేస్తూ నోటీసు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం కేసును 30వ తేదికి వాయిదా వేశారు.

న్యాయం గెలవడమే ముఖ్యం

ఈ కేసువల్ల తాను పుంగనూరు ఎమ్మెల్యే కాకపోయినా న్యాయం గెలవడం, అక్రమార్కుడు పెద్దిరెడ్డి ఓటమే ముఖ్యమని బోడే రామచంద్రయాదవ్ అన్నారు. ఎమ్మెల్యేగానే కాదు అసలు రాజకీయాల్లోనే పెద్దిరెడ్డి ఉండకూడదన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దహనంలో పెద్దిరెడ్డి అక్రమ ఆస్తులకు ప్రమేయం ఉందని ఆరోపించారు. పుంగనూరు ప్రజలు ప్రశాంతంగా ఉండాలంటే పెద్దిరెడ్డి రాజకీయాలకు దూరం కావాలని, చేసిన తప్పులకు శిక్ష పడాలని అన్నారు.

విద్యుత్ శాఖ గ్రీవెన్స్‌కు 22 వినతులు

● అప్పటికప్పుడే 9 పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూలై 24: ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ, ఈఈ కార్యాలయాల్లో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 22 వినతులు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఇందులో తిరుపతిలో 5, చిత్తూరు ఆపరేషన్‌లో 6, పుంగనూరు 6, మదనపల్లె 5 వచ్చాయని వెల్లడించారు. ప్రతి బుధవారమూ నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో చిత్తూరు ఆపరేషన్ ఈఈ మునిచంద్ర వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే 9 పరిష్కరించామని, మిగిలినవి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

చెంగుబల్ల వీఏఏ సస్పెన్షన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 24: శాంతిపురం మండలం చెంగుబల్ల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.వినయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో రైతులకు విక్రయించిన ఎరువులకు సంబంధించి డబ్బు చెల్లింపులో నాలుగు నెలలుగా జాప్యం జరుగుతుండడం, రూ.2.32 లక్షలు రావాల్సి ఉండడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

పంట పొలాలపై ఒంటరి ఏనుగు దాడి

ఐరాల, జూలై 24: ఐరాల మండలం వినాయకపురంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడి చేసింది. కొబ్బరి, అరటి తోటలను నాశనం చేసింది. సాయీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వినయ్‌రెడ్డికి చెందిన కొబ్బరి, అరటి తోటలతో పాటు కంచె కూసాలను విరిచేసింది. అపోలో గ్రూపు ఛైర్మన్ ప్రతాప్ ఎ.సి.రెడ్డికి చెందిన ఔషధాలకు వినియోగించే ఉసిరి చెట్లను ధ్వంసం చేసింది. రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.



ఏనుగు విరిచేసిన కంచె, కూసాలు

టమోటా తోటలపై ఏనుగుల దాడి



పత్రపల్లె సమీపంలో ఏనుగుల బీభత్సం

సోమల: సోమల మండలం ఇవిసెలుకూరివారిపల్లె నుంచి అడుసుపల్లె, జీడిరేవులవంక, వంగసానివారిపల్లె మీదుగా రాంపల్లె బీట్‌కు మంగళవారం రాత్రి ఏనుగులు చేరుకున్నాయి. ఈ క్రమంలో పత్రపల్లె, కొత్తూరుకు చెందిన శివకుమార్‌రాజు, రామకృష్ణమరాజు, జగన్నాథరాజు, చలపతిరాజుకు చెందిన టమోటా, వరి, కొబ్బరి, బొప్పాయి తోటలను ధ్వంసం చేశాయి. వారంరోజులుగా ఒంటరి ఏనుగు రాంపల్లె బీట్‌లోనే హల్‌చల్ చేసింది. మంగళవారం రాత్రి దీనికి మరో గుంపు తోడైంది.

అవిగో ఏనుగులు!

సోషల్ మీడియాలతో ఆకతాయిల చేష్టలతో భయాందోళన

గుడుపల్లె, జూలై 24: గుడుపల్లె మండలంలో బుధవారం ఉదయం ఏనుగులు సంచరిస్తున్నాయన్న వార్తలు కలకలం సృష్టించాయి. కర్ణాటక సరిహద్దుల్లోని కొడతనపల్లె, బిసానత్తం, అత్తినత్తం తదితర గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చూసి ఆందోళన చెందారు. అటవీ శాఖాధికారులు కూడా ఆ ప్రాంతాలకు వెళ్లి గాలించారు. ఎక్కడా ఏనుగుల గుంపు కనిపించలేదు. ఈ పోస్టులన్నీ తప్పుడువని, అందులో వచ్చిన సమాచారం అబద్ధమని మధ్యాహ్నానికి తేలింది. కొడనపల్లెకు చెందిన ఓ ఆకతాయి ఈ ఫేక్ న్యూస్ పోస్టులు పెట్టి ప్రచారం చేశాడని అదే గ్రామానికి చెందిన రైతులు చెప్పారు.

గేట్లు తెరిచి దారివ్వండి

హైకోర్టు ఆదేశం - అయినా లెక్కచేయని పెద్దిరెడ్డి



పెద్దిరెడ్డి ఇంటి సమీపంలో బుధవారం కూడా మూసివున్న గేట్లు

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మారుతీనగర్, రాయల్‌నగర్ మెయిన్‌రోడ్లను కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లను మూసివేయవద్దని, సామాన్య ప్రజల రాకపోకలకు అవరోధం కల్పించవద్దని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వేసిన రోడ్డుకు పెద్దిరెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా గేట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ గేట్లను ఓపెన్‌చేసి రెండు కాలనీలకు రాకపోకలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా ఇప్పటికీ గేట్లు తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.దీని పూర్వాపరాలు పరిశీలిస్తే...కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు ఏర్పాటుచేసుకోవడంపై మీడియాలో కథనాలు రావడంతో మూడు వారాల క్రితం పెద్దిరెడ్డి ఇంటిముందు జనసేన నేత కిరణ్ రాయల్ ధర్నాకు దిగిన నేపథ్యంలో వివాదం రోడ్డెక్కింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరారు. స్థానిక 18వ డివిజన్లోని మారుతీనగర్-రాయల్ నగర్‌ను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50 లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చినట్టు అధికారులు గుర్తించారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డుల్లో నమోదు చేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు.అయితే ఈలోపు పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు.సంబంధిత స్థలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రక్షణ కోసం నిర్మించిన గేటును తొలగించకుండా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారని, అందుకైన ఖర్చు కూడా తాము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థించారు. కార్పొరేషన్ తరపున కూడా ఓ నివేదికను కోర్టుకు సమర్పించారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్..పిటీషనర్ల ఆస్తుల విషయంలో ఏవైనా చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్టనిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.ఇంతవరకు పెద్దిరెడ్డికి అనుకూలమైన తీర్పువచ్చినప్పటికీ 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్ పిటీషన్ దాఖలు చేశారు.ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా,గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు స్పష్టంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి కేసును 4 వారాలకు వాయిదా వేసింది. పిటీషనర్ల ఆస్తికి ఏదైనా ముప్పు ఉన్నట్లైతే, అవసరమైన రక్షణ కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.చట్టనిబంధనలను అనుసరించి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. పిటీషనర్ల ప్రైవేటు ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు, బలవంతపు చర్యలు తీసుకోవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది.ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి.అయితే ఇప్పటికీ ఆయన గేట్లు తెరిచివుంచకపోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం అటువైపు వెళ్లేందుకు కూడా సాహసించకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం బాధ్యతలు తీసుకున్న కొత్త కమిషనర్ అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

ఏటీఎంలో నగదు చోరీ కేసులో ఒకరి అరెస్టు

● మరో నలుగురి కోసం గాలింపు చర్యలు

గుడిపాల, జూలై 24: గుడిపాల ఏటీఎంలో నగదు చోరీ కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. మరో నలుగురికోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఈనెల 7వ తేదిన ఎస్బీఐ ఏటీఎంలో సుమారు రూ.25.98 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు మూడు బృందాలుగా హరియాణాలో గాలింపు చర్యలు చేపట్టారు. దొంగతనానికి ఉపయోగించిన కారును, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా మరో నలుగురి పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. దొంగతనానికి పాల్పడిన ప్పటి నుంచి ఫోన్‌కాల్ ఆధారంతో సాంకేతిక పరిజ్ఞానంతో దుండగులు హరియాణా వాస్తవ్యులుగా గుర్తించారు. ఈ చోరీకి ఐదుగురు వ్యక్తులు పాల్పడినట్లుగా గుర్తించి, వారిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించి, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలను రాబట్టే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

అంతరపంటలతో వేరుశనగలో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

గంగవరం, జూలై 24: వేరుశనగ పంటలో అంతర్ పంటల సాగు ద్వారా చీడపురుగుల బారి నుంచి బయటపడటంతోపాటు అనుకున్న దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం దండపల్లె కురపల్లె సమీపంలో వేరుశనగ పొలంలో అంతర్‌పంట సాగు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో సరిహద్దు పంటగా జొన్న లేదా సజ్జ, అంతర్‌పంటలుగా కంది వేయాలని సూచించారు. తద్వారా వేరుశనగకు చీడపురుగుల బెడద తప్పుతుందన్నారు. ఎకరాకు సుమారు 200 బస్తాల జిప్సం వేస్తే అనుకున్న దిగుబడి సాధించవచ్చన్నారు. వరి రైతులు ఈ సీజన్‌లో తూర్పు - పడమరకు లైన్ షోయింగ్ విధానం ద్వారా 20 సెం.మీ. దూరంలో వరినాట్లను విత్తాలన్నారు. దీనివల్ల పంటకు గాలి, వెలుతురు పుష్కలంగా అంది అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శివకుమార్, ఏవో హేమలత, సర్పంచ్ బీరుగౌడుతో పాటు రైతులు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి ● ఇద్దరి పరిస్థితి విషమం, మరో పది మందికి గాయాలు







గాయపడిన అఖిలేష్‌కుమార్ - మృతిచెందిన అనూప్‌సర్దార్ - కాలిన గాయాలతో రుయాలో చికిత్స పొందుతున్న రాజు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

కల్లూరు, 24: పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ గొట్టిగింటివారిపల్లికి వెళ్లే మార్గంలో బుధవారం 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. ఒంగోలు జిల్లాకు చెందిన ఏవీఆర్ కంపెనీ పులిచెర్ల మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు చేపడుతోంది. ఒడిశా, బిహారు రాష్ట్రాలకు చెందిన కూలీలు పులిచెర్లలో ఉంటూ ఈ పనులు చేస్తున్నారు. బుధవారం ఉదయం కావేటిగారిపల్లి పంచాయతీలో ట్యాంకు నిర్మాణ పరికరాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని 13 మంది కూలీలు బయలుదేరారు. భీమవరం రోడ్డు నుంచి గొట్టిగింటివారి పల్లి ఏటవాలుగా ఉండే మార్గంలో వెళుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఒక్కసారిగా విద్యుత్ వైర్లు తెగి ట్రాక్టర్‌పై పడ్డాయి. ట్రాలీలో ఉన్న కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ముందు టైర్లు విరిగిపోవడంతో ట్రాక్టర్ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. విద్యుదాఘాతంలో మరికొందరికి తీవ్రగాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా మహరాజ్‌పలికి చెందిన అనూప్ సర్దార్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. బీహార్ రాష్ట్రానికి చెందిన అఖిలేష్‌కుమార్‌కు, ఒడిశాకు చెందిన రాజు పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాకు చెందిన కళ్యాణ్, ఒమ్మతో, శుశాంత్, రాజ్, కురు, రమేష్, మహేందర్, శుభ, భీమ, బీహార్‌కు చెందిన గుండోల్‌కుమార్, సదుం మండలానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రవి గాయపడ్డారు. కొందరికి విద్యుదాఘాతంతో శరీరం కాలగా, మరికొందరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. స్థానికుల చొరవతో క్షతగాత్రులను ముందుగా ఎల్లంకివారిపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనూప్ సర్దార్ మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అత్తింటివారే నా కూతురిని కొట్టి చంపేశారు

● పోలీసులకు మహిళ ఫిర్యాదు


సాయిప్రియ వివాహంనాటి ఫొటో (ఫైల్)

మదనపల్లె అర్బన్, జూలై 24: తన కూతురిని అత్తింటివారు కొట్టి చంపేశారంటూ లక్ష్మీదేవి అనే మహిళ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నీరుగట్టువారిపల్లె సమీపంలోని బాబుకాలనీకి చెందిన శ్రీనివాసులు కుమారుడు మణి కంఠ, పట్టణంలోని రాంనగర్‌కు చెందిన లక్ష్మీదేవికు మార్తె సాయిప్రియాంక (24) ఆరు నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంత కాలానికి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. మద్యానికి బానిసలైన భర్త తోపాటు, మామ శ్రీనివాసులు డబ్బు కోసం సాయి ప్రియాంకను హింసించేవారు. రూ. 5 లక్షలు డబ్బు తీసుకురావాలని రెండు నెలలుగా ఆమెను ఇబ్బందులకు గురి చేస్తూ సక్రమంగా భోజనం చేయనిచ్చేవారు కారని లక్ష్మీదేవి ఫిర్యాదులో పేర్కొంది. మంగళవారం రాత్రి భర్త మణికంఠ, మామ శ్రీనివాసులు, అత్త ఉష, తాత మునెప్ప కలిసి సాయిప్రియాంకను కొట్టి చంపేసి, కమ్మీకు చీరతో ఉరివేశారని, అనంతరం తన అల్లుడు తనకు ఫోన్ చేసి నీ కూతురు చనిపోయిందని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు.

వృద్ధురాలిపై దాడి చేసి ఇంట్లో చోరీ..


దుండగులు పగలగొట్టిన బీరువా

పీలేరు, జూలై 24: ముగ్గురు గుర్తు తెలియని దుండగులు వృద్ధురాలిపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు, ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోడేషావలి పీలేరు-మదనపల్లె మార్గంలోని హుమయూన్ కల్యాణ మండపం వద్ద తన తల్లి కె.ఎస్. జెహరాబీ(60)తో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై దాడి చేయడమే కాకుండా ఇంటిలోని బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న బోడేషావలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం రాయచోటి డీఎస్పీ రామచంద్ర రావు, పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి బోడేషావలి ఇంటిని పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఇంటిలో ఉన్న రూ.60 వేల నగదుతోపాటు తన తల్లి ఒంటిపై ఉన్న రూ.3 లక్షలు విలువజేసే ఒక బంగారు చైను, రెండు చేతి గాజులు, రెండు కమ్మలు, రెండు ముక్కుపుడకలు దుండగులు దోచుకెళ్లినట్లు బోడేషావలి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేపూరికోట సమీపంలో చోరీ

● మూడు కేజీలు విలువ చేసే వెండి, సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్, రికార్డర్ అపహరణ


సీసీ కెమెరాలో రికార్డయిన గుర్తుతెలియని వ్యక్తి చిత్రం

ములకలచెరువు, జూలై 24: మండలంలోని వేపూరికోట సమీపంలో ఉన్న ఉమాశంకర్‌కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి బెంగళూరులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ, అక్కడే నివాస ముంటున్నాడు. కాగా, సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్థానికంగా ఉన్న ఇంటి తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులోని మూడు కేజీలు విలువ చేసే వెంట వస్తువులు అపహరించారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్, రికార్డర్‌ను కూడా తీసుకెళ్ళారు. సీసీ కెమెరాలను సెల్‌ఫోన్‌కు కనెక్ట్ చేయడంతో, చివరిగా గుర్తుతెలియని వ్యక్తి చిత్రం సెల్‌ఫోన్‌కు అందడంతో చోరీ జరిగిన విషయం తెలిసి వచ్చింది. వెండి వస్తువుల విలువ రూ2.10లక్షలు ఉంటుందని బుధవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి


నాగార్జున (ఫైల్ ఫొటో)

పీలేరు, జూలై 24: పీలేరు మండలం ముడుపులవేముల పంచాయతీ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి. నాగార్జున(36) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం ఇంటిలో ఉండగా గుండెల్లో నొప్పిగా ఉందని తెలుపడంతో కుటుంబసభ్యులు అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు వదిలాడు. అతనికి భార్య రెడికాంత, నవ్యశ్రీ, షణ్ముఖప్రియ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగార్జున 2006 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ పెద్ద మరణించడంతో తాము దిక్కు లేని వారమయ్యామని, తమను ఆదుకోవాలని నాగార్జున భార్య రెడ్డికాంత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. నాగార్జున మృతికి ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి, ఉపాధి ఏపీవో మహేశ్వర సంతాపం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థులు

మదనపల్లె టౌన్, జూలై 24: కడప జిల్లా ఇడుపులపాయలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు మదనపల్లెలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల చైర్‌పర్సన్ అమృత, శ్రీదేవి తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాల్, రూహిత, ఆర్యన్, రేవంత్, లిఖిత్, మహ్మద్‌ఖాజా, మహిత్, ఇజాన్, లోహిత్ పాల్గొననున్నారన్నారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ షెహనాజ్, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, టార్గెట్‌బాల్ జిల్లా సెక్రెటరీ మహ్మద్ అలీ అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయాలపై పోలీసుల నిఘా

● రాత్రి వేళల్లో వీఆర్‌ఏల కాపలా..


తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల గస్తీ


తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచిన రికార్డులు

ములకలచెరువు, జూలై 24: నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్ కార్యాలయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కావడంతో ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలపై కూడా పోలీసులు నిఘా పెట్టారు. మదనపల్లె ఘటన జరిగినప్పటి నుంచి రాత్రి వేళల్లో పోలీసులు పలు మార్లు తహసీల్దార్ కార్యాలయాల వద్దకు వచ్చి పరిశీలించి వెళ్తున్నారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయం వద్దకు మంగళవారం రాత్రి వచ్చిన ఏఎస్ఐ నజీర్‌అహ్మద్, కానిస్టేబుల్ నరసింహ కార్యాలయంలో ఎవరెవరూ నిద్రిస్తున్నారో ఆరా తీశారు. నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో వీఆర్‌ఏలు రాత్రి వేళల్లో నిద్రిస్తూ రికార్డులకు కాపలా ఉంటున్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలతో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలోకి వచ్చే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట మండలాల తహసీల్దార్ల కార్యాలయాల్లో ఆర్డీవో స్థాయి అధికారులు, రామచోటి నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు రికార్డులు పరిశీలించి సీజ్ చేసిన విషయం విదితమే. ములకలచెరువులో 40, పెద్దమండ్యంలో 32, బి.కొత్తకోటలో 73, కురబలకోటలో 40, తంబళ్లపల్లెలో 41, పెద్దతిప్ప సముద్రంలో 35 వరకు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పంపిన 22(ఎ), చుక్కల భూములు, కన్వర్షన్, ఆర్‌వోఆర్, కోర్టు కేసులు తదితర రికార్డులను తీసుకెళ్ళి కలెక్టర్‌కు సమర్పించారు. ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఉన్న గదిలో రికార్డులను భద్రంగా ఉంచారు. రికార్డులను కట్టుదిట్టంగా భద్ర పరచడంతో అన్ని సురక్షితంగా ఉన్నాయి.

మాధవరెడ్డి సన్నిహితులను కూడా విచారించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో కీలక ఫైళ్ల దగ్ధం కేసులో పోలీసులు అనుమానిస్తున్న వైసీపీ నాయకుడు రైస్‌మిల్లు మాధవరెడ్డితో పాటు అతని సన్నిహితులను కూడా పోలీసులు విచారిస్తే మరిన్ని కుట్రలు బయటపడతాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ అన్నారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫైళ్ల దగ్ధం కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, ఈ ఘటనలో వైసీపీ నాయకులకు చెందిన 22-ఏ ఫైళ్లతో పాటు సామాన్య ప్రజలకు చెందిన విలువైన ఫైళ్లు తగలబడి పోయాయన్నారు. ఇక్కడ పనిచేసిన ఆర్డీవో మురళి హయాంలో ఎక్కువగా అక్రమాలు జరిగాయని ఆరోపించా రు. దీనినంతటినీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి వెనుక వుండి నడిపారన్నారు. మాధవరెడ్డి ఇంట్లో సోదాలు చేసిన పోలీసులకు రెండు బస్తాల్లో రెవెన్యూ రికార్డులు లభించినట్లు తెలిసిందని, అదే విధంగా అతని సన్నిహితులైన తట్టివారిపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు, మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, సీటీఎం ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడి నివాసాల్లో సోదాలు చేసివుంటే మరిన్ని సాక్ష్యాలు బయటపడేవని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే అక్రమాలు బట్టబయలు

మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవతోనే వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు, భూదందాలు బయటపడుతున్నాయని టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద టీడీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత షాజహాన్‌బాషా మదనపల్లె ప్రాంతంలో వైసీపీ నాయకుల భూదందాపై దృష్టి పెట్టారన్నారు. రెవెన్యూ అధికారుల విచారణలో సుమారు రూ.500 కోట్ల ప్రభుత్వ, డీకేటీ, లిటిగెంట్ భూములు వైసీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయని తెలిసిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తామని షాజహాన్‌బాషా హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి కీలక 22-ఏ విభాగంలో ఫైళ్లు తగలబడిపోయిన సంఘటన చోటుచేసుకుందన్నారు. ఈ వ్యవహారంలో కొందరు వైసీపీ నాయకుల హస్తం వుందని ఆరోపించారు. టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎస్‌ఏ మస్తాన్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రాటకొండ మధుబాబు మాట్లాడుతూ ఫైళ్ల దగ్ధం ఘటనపై సీఐడీ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారున్నా సీఎం చంద్రబాబు వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సంగం శ్రీనివాసులు, నీలకంఠ, గౌతమ్‌రెడ్డి, ఖాబునాయుడు, షంషీర్, నాదెళ్ల శివన్న, నాగూర్‌వలి, సుద్దిళ్ల సుధాకర్, సహదేవనాయుడు, జంగాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

●ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

బి.కొత్తకోట, జూలై 24: కార్మికవర్గంపై దాడులు చేస్తూ, కార్మిక హక్కులు చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో రెండురోజుల పాలు జరగనున్న ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వివిధ రకాలుగా పన్నులు పెంచి కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూరుస్తోందని ఆరోపించారు. వికసిత్ భారత్‌కు 2024-25 బడ్జెట్ తోడ్పడుతుందని ముందుగానే ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గానికి తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల నేరుగా బడ్జెట్‌లో కేటాయిస్తామని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెప్ప కపోవడం ఆంధ్రరాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మునిసిపల్ కార్మికులకు సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, రాధాకృష్ణమూర్తి,రామారావు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరాయుడు, తులశేంద్ర, రామచంద్ర, సాంబశివ, బందెలరవి, రాజేష్‌గౌడ్,సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు


ఎస్టీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్ చలపతి

మదనపల్లె టౌన్, జూలై 24: మదనపల్లె మండలం కురవంక గ్రామ పంచాయతీ శివారులోని ఎస్టీ కాలనీలో బుధవారం సర్పంచ్ చిప్పిలి చలపతి ఆధ్వర్యంలో 50 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కాలనీ పొన్నేటిపాళెం పంచాయతీ పరిధిలో వున్నా, అక్కడి ప్రజలు కురవంక సచివాలయానికి వచ్చి సమస్యలు విన్నవించారన్నారు. పంచాయతీ పరిధులు చూడకుండా వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, గిరిజన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానన్నారు.

ఉత్తమ విద్యార్థినులకు ప్రోత్సాహకాలు పంపిణీ


ఉత్తమ విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

కలికిరి, జూలై 24: 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కలికిరి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు బుధవారం దాతలు, ఉపాధ్యాయులు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. కలికిరికి చెందిన డా.ప్రమీల రాజగోపాల్ రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం 'కృష్ణమ్మ మెమోరియల్ మెరిట్ స్కాలర్‌షిప్' ద్వారా 576 మార్కులు సాధించిన ఎం.రుబీనాకు రూ.25 వేలు, 557 మార్కులు సాధించిన బి.వెన్నెలకు రూ.15 వేలు, 556 మార్కులు సాధించిన టి.సుప్రియకు రూ.10 వేలను చెక్కు రూపంలో సర్పంచ్ ఎల్లయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు యోగేశ్ రెడ్డి, ఎంఈవో కరీముల్లా, హెచ్‌ఎం జయమ్మ, పాఠశాల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ బకాయిలు చెల్లించండి


ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌ను సన్మానిస్తున్న ఎన్‌టీఏ నాయకులు

పీలేరు, జూలై 24: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. విజయవాడలో బుధవారం మంత్రిని కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఇకపై విధిగా ప్రతినెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలని తాము విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. పీఎఫ్‌కు సంబంధించిన అరియర్స్‌పై మరో నెల రోజుల్లో చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు రెడ్డి రమేశ్ తెలిపారు. ఎన్‌టీఏ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జయప్రకాశ్ నాయుడు, తిరుపతి జిల్లా అధ్యక్షులు భాస్కర నాయుడు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి

కలకడ, జూలై 24: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వలన పర్యావరణం పరిరక్షణ సాధ్య మవుతుందని ఎంపీడీవో పర మేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అవరణలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. రోగులు ఇబ్బందులు పడకుండా దారిలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మల్లిర్జున, మోహన్, కార్యదర్శి దేవేంద్ర పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు


శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలు

వాల్మీకిపురం, జూలై 24: పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు కనీస రక్షణ లేకుండాపోతోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రెండు భవనాలూ బ్రిటిష్ వారి హయాంలో నిర్మించినవే. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. కిటికీల తలుపులు ఊడిపోవడంతో రికార్డులకు రక్షణ లేకుండా పోతోంది. నిత్యం వందలాది మంది ప్రజలతో కిటకిటలాడే ఈ కార్యాలయ భవనం ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లుండడంతో అధికారులు, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. రికార్డు గదిలో భద్రపరిచిన రికార్డులు వర్షానికి తడిసి, చెదలు పట్టి ధ్వంసం అవుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది . ఏళ్ల తరబడి తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం తప్ప, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయ భవనాలు పటిష్ఠ పరచుకోవడమో, నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్దమండ్యంలో ఆగిన ఆధార్ సేవలు


నిరుపయోగంగా కంప్యూటర్

పెద్దమండ్యం, జూలై 24: ఏడాది నుంచి ఆధార్ సేవలు ఆగిపోవ డంతో పెద్దమండ్యం గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఐరి స్ నమోదు చేసే పరికం కిందపడి పగిలిపోవడమే సమస్యకు కారణమని సిబ్బంది చెబుతున్నారు. అప్పటి నుంచి దానికి మరమ్మతులు చేయించడమో, కొత్తది కేటాయిం చడమో చేయకపోవడంతో ఆధార్‌లో చే ర్పులు మార్పులు, చిన్నారులకు కొత్త ఆధార్ కార్డు నమోదు తదితర అవసరాలకు గ్రామస్తులు కలిచెర్ల గ్రామ సచివాలయం, పెద్దమండ్యం గ్రామీణ బ్యాంక్ అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. రెండు రోజులుగా అధికారులు ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నారు. అందుట రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే ఆధార్ వివరాలు అప్‌డేట్ చేస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం కేంద్ర ప్రభుత్వం రెండు నెలలు మాత్ర మే గడువు ఇవ్వడంతో మండలాల్లో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచడంపై అధికారులు స్పందిచాల్సి ఉంది. పెద్ద మండ్యం గ్రామ సచివాలయంలో 9 నెలల క్రితం ఐరిస్ నమోదు పరికరం పాడవడంతో , సంబంధిత ఇంజనీరు కు సమాచారం ఇచ్చినట్లు ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. ఈ పరికరం సమకూర్చి వెంటనే ఆధార్ సేవలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

బీటీ కళాశాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి


హోంమంత్రిని కలిసిన బీటీ కళాశాల సిబ్బంది బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్

మదనపల్లె అర్బన్, జూలై 24: సమస్యలను పరిష్కరించాలని బుధవారం విజయవాడలోని ఏపీ సచివాలయంలో విద్యాశాఖామాత్యుడు నారా లోకేష్, హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్‌కౌర్‌ను బీటీ కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో పాటు బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేసినట్లు జీవో విడుదల అయిన అనంతరం టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల వివరాలను ప్రభుత్వానికి పంపాలని కోరగా, అప్పట్లో కళాశాల కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం అనర్హుల పేర్లను ప్రభుత్వానికి పంపారని ఆరోపించారు. వారికి ప్రభుత్వం ప్రొసీడింగ్స్ జారీ చేయడంతో ఉన్నతాధికారులు, నాయకులు ఫిర్యాదు చేశామన్నారు. అయినా, పాత ప్రొసీడింగ్స్‌నే కొనసాగించారన్నారు. బహుజన యువసేన ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక అమలు ఎన్నికల కారణంగా వాయిదా పడిందన్నారు. కళాశాల కరస్పాండెంట్‌తోపాటు, మరికొందరు మంత్రిని కూడా మోసం చేసి ప్రొసీడింగ్స్‌ను ఇప్పించుకున్నారన్నారు. అర్హులైన ఆరుగురు నాన్‌టీచింగ్ సిబ్బంది పేర్లు ప్రొసీడింగ్స్‌లో లేకుండా చేశారని తెలిపారు. దీనిపై విచారణ చేయించి న్యాయం చేస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. మదనపల్లె పట్టణం, కొత్తయిండ్లు సచివాలయంలోను, ప్రస్తుతం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదాలపై పూర్తి విచారణ జరిపించి, దుశ్చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను కోరినట్లు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న డీపీవో ధనలక్ష్మి

గుర్రంకొండ, జూలై 24: గ్రామాల్లో పారిశుధ్యం లోపం లేకుండా చూ డాలని డీపీవో ధనలక్ష్మి సిబ్బందికి సూచించారు. మండలంలోని తరిగొండలో జరుగుతున్న శానిటేషన్ డ్రైవ్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానుండడంతో పారిశుధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పారిశుధ్యలోపంతో వైరల్ ఫీవర్స్ వచ్చే ప్రమాదముందన్నారు. మండలంలోని అన్ని డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకొచ్చి సంపదను రాబట్టే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అబ్దుల్ సుకూర్, కార్యదర్శు లు విశ్వనాథ్ పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితో రాష్ట్రానికి మంచి రోజులు


కార్యకర్తలు, నేతలతో టీడీపీ నేత త్యాగరాజు

ములకలచెరువు, జూలై 24: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితో రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు అన్నారు. మండలంలోని దేవళచెరువులో బుధవారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించి పోలవరం, అమరావతి, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి మోదీ ప్రభుత్వం సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రషీద్, శ్రీనివాసులు, శంకర, ఉత్తమనాయుడు, రాము, లక్ష్మీపతి, మారపరెడ్డి. మధు, శ్రీకాంత్, చలపతి, మస్తానప్ప, ఈశ్వర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని మాజీ వలంటీర్ల వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ వలంటీర్లు

ములకలచెరువు, జూలై 24: రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామాలు చేశాం...తిరిగి తమకు విధుల్లోకి తీసుకోవాలని పలువురు మాజీ వలంటీర్లు ఎంపీడీవో పోలప్పకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని వేపూరికోట గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో పోలప్ప తనిఖీ చేసిన సందర్భంగా వారు ఆయనను కలిశారు. ఐదేళ్లపాటు సేవలందించిన తాము 2024 సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సేవలకు దూరంగా ఉన్నామని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పుడు రాజకీయ నాయకుల ఒత్తిడితో రాజీనామా చేయవలసి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వలంటీర్లు అనితాకుమారి, గౌతమి, సునిత, దర్శిని, రెడ్డిరాధా, నందిని, అశ్వని, సులోచన, అనిత తదితరులు పాల్గొన్నారు.

కనుగొండ ఆలయ భూముల లీజు హక్కుల వేలం


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

ములకలచెరువు, జూలై 24: మండల కేంద్రం సమీపంలోని కనుగొండరాయ స్వామి ఆలయం భూమిలో దుకాణాల నిర్వహణకు బుధవారం వేలం నిర్వహించారు. బి.కొత్తకోట దేవదాయ శాఖ ఈవో మునిరాజ, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి సమక్షంలో 19 దుకాణాల ఏర్పాటుకు ఖాళీ స్థలాలను మూడేళ్ళపాటు లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించారు. దీని ద్వారా దేవదాయ శాఖకు నెలకు రూ.31వేలు ఆదాయం రానుంది. ఈ కార్యక్రమంలో మంత్రి గిరిధర్‌రెడ్డి, దాసరిపల్లి నారాయణరెడ్డి, నాయకులు కేవీ రమణ, ప్రభాకర్‌రెడ్డి, పాలగిరి గౌరీశంకర్, శంకర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

నిమ్మనపల్లి, జూలై 24: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ లోకేశ్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేశామని ఇందులో వుండే లింక్‌ను క్లిక్ చేసి సభ్యులుగా చేరాలని సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపుతున్నట్లు తెలిపారు. దీనిని నమ్మి గ్రూపులో వచ్చిన లింక్‌న క్లిక్ చేసిన వారి సెల్‌ఫోన్ హ్యాక్ అవుతుందని, దీని ఆధారంగా వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును దోచేసేందుకు కుట్రపన్నినట్లు తెలిపారు. పలు మాధ్యమాల్లో చిలుకను, సింహాన్ని తాకమని ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని వాటిని నమ్మకూడదని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి తాము బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని వ్యక్తిగత వివరాలు అడిగినా ఇవ్వరాదని తెలిపారు. ఇలాంటి వాటికి ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు దూరంగా వుండాలని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


వ్యాయామం చేస్తున్న విద్యార్థినులు

వాల్మీకిపురం, జూలై 24: క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెరుగుతుందని జడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థినులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసనాలతో నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పీడీ ఉమాదేవి, ఉపాధ్యాయి నులు నాగరత్న, పుష్పలత, వసుంధర, అనురాధ, రేణుక, షంషాద్, సునీత, వేదవాణి, రాధ, రాధిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు..


రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ చంద్రానాయక్

వాల్మీకిపురం, జూలై 24: అంతర పంటల సాగు ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ తెలిపారు. బుధవారం ఆయన వాల్మీకి పురం మండలంలోని జర్రావారిపల్లెలో నిర్వహించిన జీఏపీ పొలంబడి కార్యక్ర మానికి హాజరయ్యారు. వేరుశనగలో విత్తన శుద్ధి, అంతర పంటల సాగు, లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుపు పల్లాల ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలన్నారు. జేడీఏ వాణిశ్రీ, ఏవో రమేష్‌రాజు, హేమలత, ఏపీ మాస్ ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్‌ఖాదర్, సీఈవోలు బాబు, గిరీష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా దుర్గలమ్మ జాతర

రామసముద్రం, జూలై 24: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం దుర్గలమ్మ అమ్మవారి జాతర నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో దీపాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలు నిర్వహించారు. బెంగళూరు నుండి ప్రత్యేకంగా పుష్పాలు తెప్పించి పుష్పపల్లకిని అలంకరించారు.